


# సత్తిబాబు - సరికొత్త వ్యూహం

సి.ఎస్. రాంబాబు

''**చ**త్ వెదవ బతుకు... వెదవ బతుకని... దీనికన్నా చస్తేపోతుంది'' ఈ మాటని మంత్రంలా అప్పటికి చాలాసార్లు జపించాడు సత్తిబాబు. ఇంతకీ సత్తిబాబు అంతలా విసుగు, నిస్పృహ చెందటానికి కారణం ఏముందంటారా... భారతదేశంలోని కోట్లాది నిరుద్యోగుల్లో అతనూ ఒకడు. అతికష్టమ్మీద డిగ్రీ పూర్తిచేశాడు. ఆ తర్వాత అడ్డమైన కంప్యూటర్ కోర్సులు చేశాడు. దురదృష్టం అతన్ని టన్నులకొద్ది వెంటాడుతుండటం వల్లో ఏమోకానీ, సత్తిబాబు ప్రయత్నాలన్నీ చిగురు తొడగని మొగ్గల్లా ఒక్కటీ వికసించలేదు.

దీనికితోడు ''ఎప్పుడొస్తుందిరా నీకు ఉద్యోగం'' అన్నట్టు కళ్లెగరేసే అన్నయ్య ''సత్తిబాబు నీ డిగ్రీ అయి ఎన్నాళ్లయిందీ'' అంటూ దీర్ఘాలు తీసే వదినా, ఇక వీళ్లే కాకుండా ''ఏమోయ్ సత్తిబాబూ... మా తమ్ముడి బావమ్మర్ది వేలు విడిచిన మేనమామ బాబయ్య కొడుక్కి మొన్నే బ్యాంకు ఉద్యోగమొచ్చింది.... మరి నీకేమొచ్చింది.. ఆ పరీక్ష నువ్వు కూడా రాసినట్టున్నావు... హిహిహి ఏమయింది..... ఓహో మళ్లీ దండయాత్రేనా... మరేం ఫర్వాలేదు.. గజనీ ఎన్ని దండయాత్రలు చేసి విజయం సాధించాడు.... నువ్వూ ఆట్టైపేనా ఏంటీ... ప్రతి కుక్కకు తనకంటూ ఓ రోజన్నట్టు నీకు నీదైన రోజంటూ ఒకటి వస్తుందిలేవయ్యా...'' అంటూ ఎత్తి పొడిచే కోటేశ్వర్రావు... ఇలా వీళ్లందరి నోళ్లు ఎలా మూయించాలో అర్థంకాక సతమతమవుతున్న సత్తిబాబు ఇక లాభం లేదు ఆత్మహత్య చేసుకోవాల్సిందే అని పొద్దుణ్ణించీ అనుకుంటున్నాడు. అయితే అది అమలు చేయటం ఎలా అని ఆలోచిస్తూ వుండగానే ''సత్తిబాబు'' అన్న పిలుపు విని ఆత్మహత్య మంత్ర జపం లోంచి బయటకు వచ్చాడు సదరు సత్తిబాబు.

''సత్తిబాబూ ఇదిగో ఐదొందలు... ఆ బ్యాంకు ఎగ్జామ్‌కు కట్టి తగలడు. అయినా నీదేం లెగ్గురా బాబూ... ఏదో కష్టపడి కంప్యూటర్ కోర్సులు చేశాడు. ఏదో రకంగా సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో తోసెయ్యొచ్చు అనుకుంటే నీ దెబ్బకు ఆ ఇండస్ట్రీ కోలుకోలేని దెబ్బతిని కుంటుతోంది. ఒక్కగానొక్క తమ్ముడివి ఏదీ రాలేదే అని మేము తెగబాధపడుతుంటే నీకు చీమకుట్టినట్టయినా లేదేంరా... పోనీ పట్టించుకోకుండా వదిలేద్దామంటే వూర్నించి రాగాలు పెడుతూ అమ్మా, నాన్న వచ్చేస్తారు. సరే....సరే ఈసారైనా జాగ్రత్తగా రాయి..'' ఇలా వార్నింగ్‌లు కమ్ డబ్బులు ఇచ్చి సత్తిబాబు

అన్నయ్య వెళ్లిపోయాడు. ఈలోగా లోపల్నించి వదిన గారి వ్యంగ్య బాణాలు సత్తిబాబు వైపు దూసుకు వచ్చాయి. ''సత్తిబాబూ ఎందుకయినా మంచిది... టీవీ పెట్టు.... గ్రహఫలితాలొస్తాయి టీవీలో ఇప్పుడు. ఏమో ఈసారైనా నీకు మంచిరోజులు దగ్గరలో వున్నాయేమో... ఎవరికి తెలుసు'' ఈటెల్లా వదినగారి మాటల తూటాలు తగుల్తూ వుంటే సత్తిబాబు టీవీ ఆన్ చేశాడు. అప్పటికే ఆలస్యమైపోవటం వల్ల జాతకాలాయన వెళ్లిపోయి ఆయన స్థానంలో ఓ వ్యక్తిత్వ వికాస శిక్షకుడు కూర్చొని గులాపూవ్వులు అమ్మే వాడిలాగా ఎదురుగుండా బోల్డన్ని గులాపూవ్వులు పెట్టుకుని ఒక గులాబీ పూవుని తీసి చూపిస్తూ ఏదో చెప్తున్నాడు. సత్తిబాబుకిదేదో ఇంట్రస్టింగ్‌గా అన్పించి టీవీ దగ్గరగా కూర్చుని చూట్టం మొదలుపెట్టాడు. ఇప్పటిదాకా ఆత్మ విశ్వాసముంటే ఏమిటో ఉదాహరణల ద్వారా మీరు తెలుసుకున్నారు. ఒకటి గుర్తు పెట్టుకోండి. రోజుకి మనకిష్టమైన రెండు పనులు చేయటం ద్వారా మనలోని ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. అలా రెట్టింపైనప్పుడల్లా ఒక గులాపూవ్వుని మీ ఖాతాలో వేసుకోండి. ఏదో ఒకరోజున మీ గదంతా గులాబీ పరిమళంతో నిండిపోతుంది. ఇదిగో ఇలాగా'' అంటూ తన దగ్గరున్న గులాబీలను చూపించాడు ఆయన. పాపం సత్తిబాబుకి మాత్రం గులాబీల గుబాళింపుకన్నా మీకిష్టమైన రెండు పనులు చేయండి అన్నదే బాగా నచ్చింది. వెధవది ఎలాగూ పోవాలని నిర్ణయించుకున్నాం. రెండు ఇష్టమైన పనులు చేసి చస్తేపోలా అనుకున్నాడు మనసులో. పోయేటప్పుడు సుఖంగా పోవచ్చు అని కూడా అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఇంట్లోంచి బయటకు వచ్చాడు. పోవటం అనే ప్రణాళికా రచనలోపడి పగలంతా రోడ్లన్నీ కొలుస్తూ తిరిగాడు. చివరికి మెయిన్‌రోడ్‌లోకి రాగానే నోరూరిస్తున్నట్టుగా మురిపిస్తూ హోటల్ ''సురిచి'' కన్పడింది. ఆ పట్టణంలో వున్న ఏకైక మూడు నక్షత్రాల ఏసి రెస్టారెంటది. ఎప్పట్నించో వెళ్లాలని ఉవ్విళ్లూరుతున్నాడు. దాని ముందునుంచి వెళ్లినప్పుడల్లా నోట్లో నీళ్లు రావటం తప్ప మరొకటి జరగలేదు. వ్యక్తిత్వ వికాస శిక్షకుడు చెప్పిన రెండు ఇష్టమయిన పనులు గుర్తుకొచ్చాయి. ఇష్టమైన మొదటి పని ఇదే అని అనుకున్నాడు. ''చలో గురూ... సురుచి కోసమేరా ఈ ఆకలి...'' అని పాడుకుంటూ లోపలికి అడుగుపెట్టాడు. సత్తిబాబు దగ్గరున్న 500 రూపాయల నోటు ఎలా పెళపెళలాడుతోందో అంతే పెళపెళలాడుతూ వచ్చాడు స్టీవార్డ్ ఇదిగో మెనూకార్డ్ ఆర్డరివ్వండి అంటూ. నిజానికి ఆ మెనూకార్డ్‌లో ఉన్న చాలా డిషెస్ గురించి సత్తిబాబుకి తెలీను కూడా తెలీదు. వింటానికి తింటానికి బావుంటాయనుకున్న పన్నీర్‌దోశ, బట్టర్ మసాల దోశ, రవ్వ ఇడ్లీలకు ఏకబిగిన ఆర్డరిచ్చేశాడు. ఇంత పెద్దఆర్డర్‌కు ఆశ్చర్యపోయిన స్టీవార్డ్ సత్తిబాబు వంక తేరిపారా చూశాడు పాపం తిండి తిని ఎన్నాళ్లయిందా అని ''హలో అలా చూడడం ఆపి అడిగినవి తెచ్చి తగలెడితే మేం తిని తగలెడతాం'' సత్తిబాబు అంటించిన చురక చురుక్కుమని తగలటంతో ఉలిక్కిపడ్డ స్టీవార్డ్ మొహాన నవ్వు అంటించుకొని లోపలికి వెళ్లాడు.

జీవితంలో మొదటిసారిగా తృప్తిగా తిని త్రేన్చిన సత్తిబాబు చివరికి స్ట్రాంగ్ కాఫీకి ఆర్డరిస్తుండగా, అప్పుడే ఆఫీసునుంచి వస్తున్న కోటేశ్వరరావు 500 రూపాయల నోటును మార్చాలి ఎలా అని అనుకుంటూ వున్న సమయంలో కన్పించిన ''సురుచి'' హోటల్ చూడగానే డబుల్ స్ట్రాంగ్ 'టీ' తాగాలని కోరిక పుట్టింది. ఎలాగూ ఐదొందల రూపాయల నోటుకి చిల్లర కావాలి, ఒక టీ చెప్పేసి అరగంటసేపు ఏసీలో కూర్చోవచ్చని ముచ్చటపడుతూ ముందుకి నడిచాడు. ''కోటేశ్వర్రావు గారూ బాగున్నారా'' అన్న మాట విన్పించినప్పుడు ఇక్కడ కూడా తనని గుర్తుపట్టే వాళ్లున్నారని మొదట చాతీ విస్తీర్ణం పెరిగినా, ఆ పిలుపు వచ్చినవైపు చూసేటప్పటికి కోటేశ్వర్రావు ఆనందం మోకాళ్లోకి జారి పోయింది. ''ఓరి నువ్వటోయ్ సత్తిబాబూ... నీ దర్జా పాడుగానూ... ఏసీ హోటల్లో కూర్చొని కాఫీ తాగుతున్నావన్నమాట'' అరువు తెచ్చుకున్న నవ్వుతో ఆముదం తాగినట్టున్న తన మొహాన్ని కవర్ చేసుకుంటూ పరామర్శించాడు. ''ఆర్డర్ సార్'' అంటూ వచ్చిన స్టీవార్డ్‌ను ఒక డబుల్ స్ట్రాంగ్ టీ అంటూ పంపించేసినా, రాకరాక ఈ నక్షత్రాల హోటల్‌కు వస్తే వీడి మొహం తగిలిందేమిటి అని కోటేశ్వర్రావు అనుకుంటూ వుంటే హమ్మయ్య ఒక కోరిక తీరింది... ఇక రెండోది ఎప్పుడూ సతాయించే కోటేశ్వర్రావుని ఇప్పుడు బకరా చేయాలి ఎలా అని ఆలోచిస్తున్నాడు సత్తిబాబు. ''అబ్బ టీ మొత్తానికి చాలా బావుందయ్యా'' ఏం మాట్లాడాలో తెలీక ఏదో మాట్లాడసాగాడు కోటేశ్వరరావు. ''కాఫీ కూడా చాలా బాగుంది సార్'' అని సత్తిబాబు అంటుండగానే రెండు బిల్లులు తీసుకొచ్చాడు స్టీవార్డ్. ''అంకుల్ ఆగండి రెండు బిల్స్ నేనిచ్చేస్తా'' సత్తిబాబు బిల్లు పేచేసేట్టు నటించే ప్రయత్నం చేశాడు. ''భలే వాడివే... అసలే నిరుద్యోగివి... నువ్విచ్చేదేమిటి... అదీ నేనున్నప్పుడు...'' టీవి ఒలకబోశాడు కోటేశ్వరరావు, నువ్వింకా బేవార్సువేనని సత్తిబాబుకి గుర్తుచేస్తూ; మొత్తానికి విజయహాసంతో రెండు బిల్లులు తీసుకుని బిల్లుతో బాటు 500 రూపాయల నోటుని బిల్లు ఫోల్డర్‌లో వుంచాడు ''ఇద్దువుగాని లేవోయ్... ఉద్యోగం సంపాదించాక... అంతవరకు నన్నివ్వనీ..'' కోటేశ్వరరావు ఈ మాటలు పూర్తి చేశాడో లేదో స్టీవార్డ్ పే చేసిన బిల్లు ఫోల్డర్ కోటేశ్వరరావు ముందుంచాడు. ''ఎంతయివుంటుంది. కాఫీ, టీ రెండు కలిపితే ఓ నలభై అయివుంటుంది. ఈ సత్తిబాబు వలన ఇరవై ఎక్స్‌ట్రాగా కట్టాల్సి వచ్చింది'' అనుకుంటూ ఫోల్డర్ తెరవగానే అందులో జస్ట్ ఓ వంద రూపాయల నోట్లు రెండు, ఒక ఇరవై రూపాయల నోటు, ఐదు రూపాయల బిళ్ల కన్పించగానే ఆ మూడు నక్షత్రాల హోటల్‌లో నిజంగానే నక్షత్రాలు కన్పించాయి కోటేశ్వర్రావుకి. అప్పుడు చూశాడు సత్తిబాబు బిల్లువంక. పన్నీర్‌దోశ 60 రూపాయలు, బట్టర్ మసాలా దోశ 60 రూపాయలు, రవ్వ ఇడ్లీ 40 రూపాయలు, ఐస్‌క్రీం 60 రూపాయలు, కాఫీ 20 రూపాయలు మొత్తం బిల్లు 240 రూపాయలుగా దర్శనమిచ్చేటప్పటికి అంతటి ఏసీలోనూ చెమటలు పట్టాయి కోటేశ్వరరావుకి ''థాంక్సంకుల్... ఇవాళే మొదటిసారొచ్చాను ఈ హోటల్‌కి. ఇలా మొదటిసారి వచ్చినప్పుడే ఇంత మంచి ట్రీట్ దొరుకుతుందనుకోలేదు. ఇంకో విషయం అంకుల్... ఇవ్వాళే పొద్దున్నే టీవీలో వండమూరి సురేంద్రనాథ్ చెప్పారు. ఆయనెవరో తెలుసుగా. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సిలర్ మీ మనసుకు నచ్చిన రెండు పనులు చేయండి... విజయం మీ సొంతం అని. నిజంగా రెండు పనులు చేశాను. లైఫ్‌లో మర్చిపోలేని రోజంకుల్ ఈరోజు'' సత్తిబాబు షాక్ ట్రీట్‌మెంట్‌కు తేరుకోని బకోరా (బకరా కోటేశ్వరావు) ఇంకో స్ట్రాంగ్ టీకి ఆర్డరిస్తుంటుంటే కొత్త ఉత్సాహంతో ముందుకు నడిచాడు సత్తిబాబు. చచ్చిపోవాలన్న కోరికకు గుడ్‌బై చెప్పేస్తూ అలా ముందుకు నడిచిన సత్తిబాబు మళ్లీ జీవితంలో వెనక్కి తిరిగి చూడలేదు. అన్న కోరుకున్నట్టు బేంకు క్లర్క్‌గా సెటిలయ్యాడు తర్వాత. కానీ బ.కో.రా. మాత్రం సత్తిబాబు వున్న పరిసర ప్రాంతాల్లో దుర్బిణీ వేసి వెతికినా కనబట్టం లేదు.

★

రచయిత సెల్ : 94904 01005

